క్లుప్తంగా

ఘనంగా కాటమయ్య పండుగ



పూజల్లో పాల్గొన్న గౌడ కులస్తులు, నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీకంఠమహేశ్వర స్వామి (కాటమయ్య) పండుగను ఆదివారం గౌడ కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ శివారులోని ఉన్న స్వామికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గౌడ కులపెద్దలను, పుర ప్రముఖులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు ఇవ్వాలి

నడిగూడెం : వానాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను మంజూరు చేయాలని రైతు సంఘం నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది సంవత్సరాలుగా రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద పరికరాలు మంజూరు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. రైతులకు కావాల్సిన యంత్రాలు, పరికరాలు మంజూరు చేయాలని కోరారు.

ఘనంగా బోనాల పండగ



బోనాలతో వస్తున్న మహిళలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో బోనాల జాతరను మహిళలు, గ్రామప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున బోనాలు ఎత్తుకొని తమ ఆరాధ్యదైవమైన గ్రామదేవతలకు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. జాతరతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

స్కాలర్‌షిప్‌కు రామాపురం విద్యార్థుల ఎంపిక

మేళ్లచెరువు : మండలంలోని రామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నాగతేజ, శ్రీరామ్‌చరణ్ నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మధు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ.12వేలు పొందనున్నట్లు వెల్లడించారు.

ఏర్పాట్ల పరిశీలన

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఈద్గాలో బక్రీద్ పండుగ సందర్భంగా నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల ఏర్పాట్లను ముస్లిం మైనార్టీ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నమాజ్‌కు వచ్చే వారికి ఇబ్బందులు కలుగకుండా మంచినీరు ఇతర ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

గేదెను ఢీకొని వ్యక్తి మృతి

మేళ్లచెరువు : గేదెను తన ద్విచక్రవాహనంతో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని రేవూరు పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన అబీర్(30) మైహోం సిమెంట్ పరిశ్రమలో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అబీర్ మరో యువకుడితో కలిసి ద్విచక్రవాహనంపై ఆదివారం కృష్ణాజిల్లా జగ్గయ్యపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా మండలంలోని రేవూరు పరిధిలోకి రాగానే రాత్రి సమయంలో ఎదురుగా రోడ్డు మీద ఉన్న గేదె కనిపించక ఢీకొట్టారు. దీంతో అబీర్ కిందపడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడని, మరో వ్యక్తికి స్వల్పగాయాలైనట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న పృథ్వీ

మఠంపల్లి : మండల కేంద్రంలోని తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో వసతుల కల్పనకు హైదరాబాద్‌కు చెందిన గంధం పృథ్వీ ఆదివారం రూ.లక్షా 50వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి, కోటయ్య, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలరెడ్డి, కోటిరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ప్రభుత్వ పాఠశాలలు

- కంపుకొడుతున్న మూత్రశాలలు, మరుగుదొడ్లు
- మూత్రవిసర్జనకు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి
- కానరాని స్వీపర్లు, స్కావెంజర్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



పాలకవీడులోని ప్రాథమిక పాఠశాల

పాలకవీడు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రభుత్వం, అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల వసతులు, నాణ్యమైన విద్య అందిస్తామని బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తూ గ్రామాల్లో ప్రచారం చేపడుతుంది. కాని అందుకు విరుద్ధంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కనపడుతున్న పరిస్థితి నెలకొంది. మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలల్లో శుభ్రత కరువై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఎవరికీ చెప్పుకోలేకపోతున్నారు. దీంతో విద్యార్థులు బహిరంగ ప్రదేశాలలో, ఇంటిబాట పడుతున్నారు. అత్యవసర సమయంలో బాలికలు, మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలల్లో పనిచేసే స్కావెంజర్లను తొలగించడంతో సమస్య తలెత్తుతున్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు.

మండల కేంద్రంలో..

పాలకవీడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో ఎక్కడిచెత్త అక్కడే పేరుకుపోయింది. అపరిశుభ్ర వాతావరణంలోనే విద్యార్థులు తరగతులకు హాజరు కావాల్సిన పరిస్థితి నెలకొంది. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం మనఊరు మనబడి పథకంలో భాగంగా నిర్మించిన అదనపు తరగతి గదుల కిటికీలు ధ్వంసమై కనిపిస్తున్నాయి. అదేవిధంగా మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్తవి నిర్మించారు. కాని అవి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పాఠశాలలు ప్రారంభమైనా ఇప్పటికీ మరుగుదొడ్లకు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవడానికి నీటివసతి కల్పించని పరిస్థితి. అదే విధంగా పాఠశాల పరిసర ప్రాంగణాలు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం, మల విసర్జనతో కంపు కొడుతున్నాయి. మంచినీటి ట్యాంకు నిర్మించినా ఇప్పటికి నల్లా బిగించలేదు. దీంతో మధ్యాహ్నం సమయంలో నీటి వసతి లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇదే దుస్థితి నెలకొంది. బడిబాట కార్యక్రమం ద్వారా అధికారులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరుగుతూ అన్ని వసతులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని ప్రచార ఆర్భాటమే తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితి దయనీయంగా ఉంది. ఇలాంటి బడుల్లో పిల్లలను ఎలా చదివించాలని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించి మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.



పాలకవీడు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు



అసంపూర్తిగా వదిలేసిన సెప్టిక్‌ట్యాంకు



నీటి సరఫరా లేని మంచినీటి ట్యాంకు

ప్రపంచ మానవాళికి కమ్యూనిజమే సరైన మార్గం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న యాదగిరిరావు

మునగాల : ప్రపంచ మానవాళికి కమ్యూనిజమే సరైన మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. ఆదివారం మండలంలోని రేపాలలో మునగాల, నడిగూడెం మండలాలకు చెందిన పార్టీ సభ్యులకు నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రతో పాటు సీపీఎం ఏర్పడిన తీరును ఆయన వివరించారు. అనంతరం డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ మాట్లాడారు. పార్టీ ప్రజాసంఘాల నిర్మాణ అంశాన్ని, భవిష్యత్ కర్తవ్యాలను తెలియజేశారు. ఈ శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య వ్యవహరించారు. శిక్షణ తరగతుల్లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బెల్లంకొండ సత్యనారాయణ, దేవరం వెంకటరెడ్డి, దేశిరెడ్డి జ్యోతి, మండల కార్యవర్గ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం, వీరబోయిన వెంకన్న, జూలకంటి విజయలక్ష్మి, షేక్ సైదా, జూలకంటి కొండారెడ్డి, దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి, ఎనుగుల వీరాంజనేయులు, కాసాని కిశోర్, రమేష్, సతీష్, మండవ వెంకటాద్రి, ఉపేందర్, గోపయ్య, గోగిరెడ్డి వెంకటరెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేస్తున్న సభ్యులు

మునగాల : వాసవీక్లబ్ గ్రేటర్స్ మునగాల, కేసీజీఎఫ్ ఫ్యామిలీ స్టార్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలు అభినందనీయమని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మిత్తింటి శారద అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వాసవీక్లబ్‌లో వాసవీక్లబ్ గ్రేటర్స్ మునగాల శాఖ, కేసీజీఎఫ్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో డాన్ టు డెస్క్ (సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు సేవా కార్యక్రమాలు) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మిత్తింటి శారద పాల్గొని పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులకు స్టేషనరీ, వృద్ధులకు చేతికర్రలు, పండ్లు, పాఠశాలలో వాటర్‌ట్యాంకు, పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి మాస్కుల పంపిణీ, దేవాలయాల్లో సేవా కార్యక్రమాలతో పాటు నేత్ర అవయవదాన పత్రాల సేకరణ నిర్వహించారు. అనంతరం గత ఆరునెలలుగా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల స్థితిగతులను తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ రీజనల్ చైర్మన్ గుండా సుధామాధురి, ఐపీసీ గుండా ఉపేందర్, సోమ పద్మ, జెడ్‌సీ వనమా అనురాధ, ఆర్‌ఈసీ బిక్కుమళ్ల లక్ష్మి, వాసవీక్లబ్ మండల శాఖ అధ్యక్షుడు కాపర్తి మణికంఠకుమార్, తోట రమాదేవి, దేవరశెట్టి శ్వేత, చిల్లంచర్ల సమత, అర్వపల్లి ప్రవీణ్, కందిబండ సంతోష్ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. కాగా ఆదివారం నిర్వహించిన సేవా కార్యక్రమాలను దాతల సహకారంతో నిర్వహించినట్లు వారిలో వంగవేటి వెంకటగురుమూర్తి, కందిబండ సత్యనారాయణ, ప్రసాద, వాసా శ్రీనివాసరావు, చలపతి, గన్నవరపు వెంకన్న, చక్కా కిశోర్, నలపాటి నాగరాజు , కందిబండ మంగేష్, తోట అజయ్, బ్రహ్మదేవర అఖిల్, రాయిపూడి వెంకటేష్, యాదా పతీష్, అద్దంకి నరేష్, గ్రామప్రజలు, వాసవీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వృద్ధులకు చేతికర్రలు పంపిణీ చేస్తున్న శారద

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు

హుజూర్‌నగర్ : ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేసి అసలైన 1969 తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు అన్నారు. ఆదివారం పట్టణంలో 1969తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసలైన ఉద్యమకారులను గుర్తించేందుకు వేసే కమిటీలో 1969 ఉద్యమకారులకు చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు జరిగిన అన్ని ఉద్యమాలకు మూలం 1969ఉద్యమం అని గుర్తుచేశారు. ఆ ఉద్యమంలో 369మంది అమరులయ్యారని, ఎంతో మంది జైళుపాలయ్యారని తెలిపారు. తొలిదశ ఉద్యమస్ఫూరితో మలిదశ ఉద్యమం జరిగి తెలంగాణ ఏర్పాటైందని ఆయన అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని ఆయన కోరారు. అనంతరం ఉద్యమకారులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మిడి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి చిలకలమూడి విశ్వేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కత్రం సీతారామిరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ముతిత్తనేని వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బూతగాని సత్యం, కోశాధికారి పునుగుపాటి వెంకటేశ్వర్లు, నాయకులు యరగాని రామస్వామి, యరగాని పూర్ణ, కందిబండ గోపాల్, ముత్తవరపు మోహనరావు, పల్లె కోటిరెడ్డి, వేముల వెంకటేశ్వర్లు, కె.జగన్నాథరెడ్డి, సీతారాంరెడ్డి, దొంతగాని సత్యనారాయణ, గోపనబోయిన వెంకటేశ్వర్లు, దొడ్డా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం

మోతె : ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి 10.30 గంటలకు చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలపల్లికి చెందిన మంద ఉపేందర్(35) మామిళ్లగూడెం సంతకు వెళ్లి గ్రామానికి తిరిగి రోడ్డు వెంట నడుచుకుంటూ వస్తుండగా గ్రామ శివారులో రాగానే ఇసుక ట్రాక్టర్ అతివేగంగా వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మఠంపల్లి : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న ఎంపీడబ్ల్యూ వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా అన్నారు. ఆదివారం మండలంలోని రఘునాథపాలెంలో పంచాయతీ వర్కర్ల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నెలల తరబడి కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే వారి జీవనం గడిచేది ఎలా అన్ని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన గ్రామశాఖ అధ్యక్షుడిగా షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్‌హమీద్, కార్యదర్శిగా షేక్ నాగుల్‌మీరా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం సీనియర్ నాయకుడు, మండల కమిటీ సభ్యుడు గురువారెడ్డి, సయ్యద్‌రహీం, అమరారపు సంతోషం, సామేల్, లక్ష్మీనారాయణ, కాంతమ్మ, నాగమణి, రమణ, మోషా, సాయికుమార్, సయ్యద్‌తాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



డ్రైఫ్రూట్స్ అలంకరణలో దేవతామూర్తులు

నేరేడుచర్ల : మండలంలోని దాసారం గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులను డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. ఆలయ పురోహితుడు హరి సురేష్‌కుమార్‌శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు కొలిచెన రవికుమార్ శర్మల ఆధ్వర్యంలో వేదమంత్రోత్సాల నడుమ గణపతిపూజ, పుణ్యావచనం, సకల దేవత మండప ఆరాధన, అభిషేకాలు, మూలమంత్ర హోమం, శాంతి కల్యాణం వంటి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆశ్రమం కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



కూల్చిన ఆశ్రమాన్ని పరిశీలిస్తున్న ట్రస్టు సభ్యులు

సూర్యాపేట : యండ్లపల్లి గ్రామ సమీపంలోని శ్రీ రామానంద ఆశ్రమాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీ రామనంద ఆశ్రమం ట్రస్టు అధ్యక్షుడు ఉయ్యాల లచ్చయ్య అన్నారు. ఆదివారం బజరంగ్ దళ్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు, ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు కలిసి ఆశ్రమాన్ని సందర్శించి మాట్లాడారు. యండ్లపల్లి గ్రామానికి గుండా అనంతలక్ష్మి ప్రోద్బలంతో పంతంగి కృష్ణయ్య, పంతంగి మల్సూర్, పంతంగి సాయికుమార్, ఉయ్యాల ఆదినారాయణలు శనివారం అర్ధరాత్రి జేసీబీలతో అక్రమంగా ఆశ్రమాన్ని కూల్చివేశారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆశ్రమంలో స్వామివార్ల కల్యాణ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, అలాంటి ఆశ్రమాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామనంద ఆశ్రమం ట్రస్టు ఉపాధ్యక్షుడు ఉప్పు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కుంట్ల భిక్షంరెడ్డి, బజరంగ్ దళ్ స్టేట్ కో కన్వీనర్ కన్నెబోయిన వెంకట్, విశ్వహిందూ పరిషత్ నాయకులు సుధాకర్, విజయ్‌కృష్ణ, గ్రామస్తులు సుదర్శన్‌రెడ్డి, రవి, నవీన్, అంజయ్య, యాదయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులకు ఇళ్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల రాము

హుజూర్‌నగర్ : అర్హులైన దివ్యాంగులందరికీ ప్రభుత్వం ఇళ్లు ఇవ్వాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం పట్టణ గౌరవ అధ్యక్షుడు ఆకుల రాము కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లు బోగస్ దివ్యాంగుల పింఛన్ల ఎరివేత త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అర్హులైన వారికి నూతన పింఛన్లు మంజూరు చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రామస్వామిగుట్టు వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన దివ్యాంగులకు ఇళ్లు ఇప్పించాలని, మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు పి.లక్ష్మణరావు, పట్టణ అధ్యక్షుడు ఎం.వీరాంజనేయులు, ఎ.శ్రీనివాసరావు, ఐ.పిచ్చయ్య, రూపారాణి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత ఆలయ బ్రహ్మోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

భానుపురి : పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో ఆలయ బ్రహ్మోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రతిష్టాపన జరిగి 28 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శివరామకృష్ణశర్మ తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలు చేశారు. సత్యసాంబశివుడు, లక్ష్మీగణపతి, ఆంజనేయస్వామి, సంతాన నాగదేవత, మానసదేవి దేవతామూర్తులకు ప్రత్యేక పంచామృత అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా కలశస్థాపన పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన పూజలు చేపట్టారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన, మల్లెల పూజా, గాజుల పూజా, పుసుపుకొమ్ముల పూజ చేశారు. రుద్ర, లలితా గణపతి హోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశంగుప్త, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, కోశాధికారి రాంమూర్తి, సభ్యులు ప్రకాష్, అశోక్, మల్లికార్జున్, సోమయ్య, వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, ఉపేందర్, లింగారెడ్డి, రవిశంకర్, శివప్రసాద్, ముత్యాలమ్మ, పద్మ, కవిత, లీల, సూర్యకళ, ప్రభావతి, రత్నమాల, కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006–2007బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా 17సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఆత్మీయంగా పలుకరించుకొని, ఒకరినొకరు తమ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు చేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. విందు, వినోదాలతో సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఆపదలో ఉన్న స్నేహితులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు గన్నా వెంకటేశ్వర్లు, సుందరి నరసింహారావు, హరీష్, శోభన్‌బాబు, కవిత, సరిత, భద్రయ్య, వెంకటేష్, నాగుల్ మీరా, వెంకన్న, సైదులు, రాంబాబు, ఆదిలక్ష్మి, పూర్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.